ఈనాడు శ్రీ సత్యసాయి

అమ్మరూపం.. ఆనందభరితం



జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం పలు ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో కొలువు దీర్చి పూజలు నిర్వహించారు. హిందూపురం పట్టణం ముద్దిరెడ్డిపల్లిలోని చౌడేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

-న్యూస్‌టుడే, హిందూపురం

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో మెరిసిన ఉపాధ్యాయులు



చెస్ పోటీల్లో విజేతలైన సీతామహాలక్ష్మి, సబిహాభానులకు జ్ఞాపికలు అందజేస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వరులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహించిన చెస్‌పోటీలు, పరుగు పందెంలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు విజేతలుగా నిలిచారని సంఘం జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు గుంటూరులో క్రీడా పోటీలు నిర్వహించారు. చెస్ పోటీల్లో మొదటి రెండు స్థానాల్లో జిల్లాకు చెందిన సీతామహాలక్ష్మి, సబిహాభాను నిలిచినట్లు చెప్పారు. 100 మీటర్ల పరుగు పందెంలో నరేష్‌కుమార్ తృతీయ, 400 మీటర్ల నడకలో శరణు ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. విజేతలకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారని వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధూప, దీప నైవేద్యానికి భరోసా

రూ.5 వేల నుంచి రూ.10 వేల పెంపునకు ఉత్తర్వులు జారీ



పుట్టపర్తిలోని లక్ష్మీనరసింహా ఆలయంలో పూజలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఆదాయం లేని ఆలయాల నిర్వహణకు ధూప, దీప నైవేద్యం సాయాన్ని రూ.10 వేలకు పెంచుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్వహణకు ఆర్థిక కష్టాల నుంచి ఉపశమనం కల్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. చిన్న ఆలయాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. వీటికి ఎటువంటి ఆదాయ వనరులు లేకపోవడంతో స్థానికులే కమిటీలుగా ఏర్పడి అర్చకులను ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్నారు. మరికొన్నిచోట్ల ఆలయాలకు సంబంధించిన పండగలకు మాత్రమే అర్చకులను పెట్టి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో దేవాలయ శాఖ పరిధిలో 1,135 ఆలయాలు ఉండగా, 265 ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యం పథకం అమలవుతోంది. వీటికి ప్రస్తుతం ప్రతి నెలా రూ.5 వేలు చొప్పున ఇస్తున్నారు. ఇందులో పూజా కైంకర్యాలకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు రూ.2 వేలు, అర్చకుడికి రూ.3 వేలు చొప్పున అందిస్తున్నారు. ఈ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భక్తులు, అర్చకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

265 దేవాలయాలకు వర్తింపు..

జిల్లాలో 265 దేవాలయాల్లో ఇక నుంచి పూజల అవసరాలకు రూ.3 వేలు, అర్చకుడికి రూ.7 వేలు చొప్పున అందించనున్నారు. గతంలో ప్రతి నెలకు రూ.13.25 లక్షలు అందిస్తుండగా, ప్రస్తుత పెంపుతో రూ.26.50 లక్షలు ఇవ్వనున్నారు.

ఉత్తర్వులు అమలు చేస్తాం


- నరసింహరాజు, జిల్లా దేవాదాయశాఖ అధికారి

దేవాదాయశాఖ ఆలయాల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు చేపడతాం. పక్కాగా అమలు చేపడానికి కృషి చేస్తాం. ఈ పథకం మరికొన్ని ఆలయాలకు వర్తింపజేయాలని ప్రతిపాదనలు పంపాం.

నేడు ప్రశాంతి నిలయంలో వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం


పుట్టపర్తి, న్యూస్‌టుడే: విశ్వశాంతిని కాంక్షిస్తూ వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం ప్రశాంతి నిలయంలో ఆదివారం ప్రారంభం కానుంది. ఏటా విజయదశమి పర్వదిన వేడుకలను పురస్కరించుకొని యజ్ఞం నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పూర్ణచంద్ర ఆడిటోరియాన్ని సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. ఆదివారం సాయి కుల్వంత్ ధ్యానమందిరంలో 7 గంటలకు వేదపండితులు మంగళవాద్యాలు, వేదపఠనం, స్వస్తి వాచకంతో ప్రతిష్ఠించిన కలశం వద్ద గణపతిపూజ నిర్వహిస్తారు. వేదపఠనం పఠిస్తూ కలశస్థాపనతో సత్యసాయి మహాసమాధి చెంతకు చేరుకొని, ప్రార్థించి, ప్రదక్షిణలు చేసి కలశాలతో పూర్ణచంద్ర ఆడిటోరియం వరకు ఊరేగింపుగా చేరుకుంటారు. ఆడిటోరియంలో ఉదయం 8.15 గంటలకు వేదమంత్రోచ్చారణతో వేదపురుష సప్తాహజ్ఞాన యజ్ఞాన్ని వేదపండితులు అరనితో మథనం చేస్తూ అగ్ని ప్రజ్వలనతో హోమ గుండాన్ని వెలిగించి ప్రారంభిస్తారు. వేదపండితులు 27 మంది నిర్వహించనున్నారు. విజయదశమిని పురస్కరించుకొని 12న యజ్ఞహోమాన్ని పూర్ణహుతితో ముగిస్తారు.

ప్రకృతి వ్యవసాయం.. ప్రగతి పథం



- ఏడాది పొడవునా పంటల సాగు
- అందరి చూపు.. రెండు గ్రామాల వైపు

అందరూ చిన్న, సన్నకారు రైతులే. దిగుబడులు రాలేదని దిగాలుగా కూర్చోలేదు. ప్రస్తుత పరిస్థితులను అధిగమిస్తూ.. వినూత్న పంథా ఎంచుకుని విశేషంగా రాణిస్తున్నారు. సేంద్రీయ ఎరువులతో ఏడాది పొడవునా ఆరోగ్యకర పంటలు పండిస్తూ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఇతర ప్రాంతాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు, రైతులు వచ్చి పంటలను పరిశీలించి.. అధ్యయనం చేస్తున్నారు. విభిన్న సాగు విధానాలు తెలుసుకొని మెచ్చుకుంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వంద శాతం ప్రకృతి వ్యవసాయంతో ప్రగతి పథంలో సాగుతూ ఆదర్శబాటలో పయనిస్తున్న రెండు గ్రామాలు ఏవీ.. అక్కడి సాగు విశేషాలు ఎలాగున్నాయో తెలుసుకుందాం.



అయిదు అంచెల్లో పంటలు

కళ్యాణదుర్గం, కుందుర్పి, న్యూస్‌టుడే

కుందుర్పి మండలం తమ్మయ్యదొడ్డి గ్రామంలో సుమారు 53 ఇళ్లు ఉన్నాయి. మొత్తం 250 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 47 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సామూహిక ప్రకృతి వ్యవసాయం (ఏపీజీఎన్ఎఫ్) పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలోనే ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేశారు. ఇక్కడ ఐదు అంచెల్లో పంటలు పండిస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. ఐదు అంచెలు అంటే.. పెద్ద, చిన్న, దాని కంటే చిన్న ఇలా రకరకాల ఎత్తులో ఉద్యాన మొక్కలను నాటి.. వాటి మధ్యలో అంతర పంటలు సాగు చేయడం. ఖరీఫ్ సీజన్‌లో మామిడి, నేరేడు, ఉసిరి, కంది, వేరుసెనగ, ఆముదం తదితరాలు నాటుకుని సంవత్సరం అంతా పండించే విధానం. ఇందుకు ఏఎఫ్ ఎకాలజీ ప్రోత్సహించింది. ప్రస్తుతం 'ఏటీఎం' పేరుతో అర ఎకరాలో కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇంటి అవసరాలకుపోనూ మిగిలినవి మార్కెట్‌కు తరలిస్తూ లాభాలు గడిస్తున్నారు. బోర్లు ఉన్న రైతులు తమలపాకు, వరి, రాగి, జొన్న, సజ్జలు, కూరగాయలు తదితర పంటలు పండిస్తున్నారు.

ప్రతినెలా తమలపాకులతో ఆదాయం

- చంద్రశేఖర్, రైతు



ఐదెకరాల్లో బోరు కింద నాలుగు రకాల పంటలు సాగు చేస్తున్నా. 1.50 ఎకరాల్లో తమలపాకు, వక్క, రెండు ఎకరాల్లో టమాటా.. 1.50 ఎకరాల్లో మామిడి చెట్లు పెట్టుకున్నా. చెరువు మట్టి, జీవామృతం, కషాయాలు వేసుకుని పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. కూలీలు, కషాయాలు తదితరాలకు ఏడాదికి రూ.2లక్షల వరకు పెట్టుబడి వస్తుంది. తమలపాకులోనే నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఆదాయం వస్తుంది.

వర్షాధారంగా ..

- నీలమ్మ, రైతు



మొత్తం 2.50 ఎకరాల పొలం ఉంది. వర్షాధారంగా పంటలు సాగు చేస్తున్నా. ఏఎఫ్ ఎకాలజీ సిబ్బంది మామిడి, ఉసిరి, పనస, చింత మొక్కలు ఇచ్చారు. వాటి మధ్యలో వేరుసెనగ, కంది, పెసర సాగు చేస్తున్నా. ఏడాది పొడవునా ఆదాయం వస్తుంది. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూనే సాగులో విభిన్న పద్ధతులు నేర్పుతోంది.



ఉగ్రేపల్లిలో సాగు చేసిన పంటలు

మడకశిర, న్యూస్‌టుడే: మడకశిర మండలం ఉగ్రేపల్లి గ్రామంలో 82 కుటుంబాలు ఉన్నాయి. 126 మంది రైతులు 180 ఎకరాల్లో వంద శాతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వర్షాధారంగా రాగి, వేరుసెనగ, మామిడి, మొక్కజొన్న, పూలతోటలు, బెండ, ఆకుకూరలు, వంకాయ, టమాటా, ముల్లంగి, క్యారెట్ తదితర పంటలు పండిస్తున్నారు. మార్కెట్‌లో కూరగాయలకు డిమాండ్ ఉంది. ప్రకృతి వ్యవసాయం చేసినప్పటి నుంచి భూములు సారవంతంగా మారుతున్నాయని రైతులు చెబుతున్నారు.

మార్కెట్‌లో మంచి గిరాకీ

- జంపన్న, రైతు



మూడు ఎకరాల పొలం ఉంది. మామిడి, చింత సాగు చేసి రూ.1.50 లక్షలు ఆదాయం పొందాను. ప్రస్తుతం 15 సెంట్లలో పూలు, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్, వంగ, మిరప, టమాటా, కంది సాగు చేయగా రూ.60వేలు ఆదాయం వచ్చింది. సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది.

ఎరువుల అంగడి.. అన్నదాతల నుంచి అదనంగా వసూలు ధరల గారడీ



ఈనాడు, అనంతపురం: వ్యాపారుల అత్యాశ.. అధికారుల నిర్లక్ష్యం వెరసి రైతులు నష్టపోతున్నారు. హోల్‌సేల్ ఎరువుల వ్యాపారులు ఒక్కో బస్తాపై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో రిటైల్ వ్యాపారులు రైతులపై మరో రూ.50 భారం మోపుతున్నారు. ఫలితంగా ఒక్కో ఎరువుల బస్తాపై రైతులు రూ.100 వరకు అదనంగా చెల్లిస్తున్నారు. ఫిర్యాదులు చేస్తున్నా వ్యవసాయశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని రైతులు వాపోతున్నారు. రైతులకు విక్రయించే ఎరువులపై కేంద్రం ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. రాయితీ పోగా కంపెనీలు ఎంఆర్‌పీని నిర్ణయిస్తాయి. నిర్ణీత ధరకే విక్రయించాల్సి ఉంటుంది. కొందరు వ్యాపారులు అదనంగా వసూలు చేస్తున్నా వ్యవసాయశాఖ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

శ్రీసత్యసాయి జిల్లాలో ఇలా..

ఎరువు రకం	అవసరం (టన్నుల్లో)	ప్రస్తుత నిల్వ (టన్నుల్లో)
యూరియా	13,441	4,527
డీఏపీ	3,591	1,499
ఎన్‌పీకే	8,890	5,906

అప్పును ఆసరాగా తీసుకుని..

సాధారణంగా రైతులు ఏటా వ్యాపారుల నుంచి ఎరువులను అప్పుగా తీసుకుంటారు. పంట విక్రయించిన తర్వాత తిరిగి చెల్లిస్తుంటారు. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులకు పెద్దమొత్తంలో ఖర్చవుతుంది. చిన్న, సన్నకారు రైతులు వ్యాపారుల వద్ద ఖాతా తెరిచి అవసరమైనప్పుడల్లా ఎరువులను అప్పుగా తీసుకెళ్తుంటారు. దీన్ని ఆసరాగా తీసుకుని రైతుల నుంచి కొందరు వ్యాపారులు అదనంగా వసూలు చేస్తున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు సైతం రిటైలర్ల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారు. బిల్లుల్లో మాత్రం నిర్దేశిత ధరలు రాస్తున్నారు. ప్రస్తుతం వానలు కురవడంతో రబీ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అదును దాటితే పంట దిగుబడి తగ్గిపోతుందనే భయంతో వ్యాపారులు చెప్పిన ధరకే కొనుగోలు చేస్తున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం


- సుబ్బారావు, వ్యవసాయశాఖ జేడీ, శ్రీసత్యసాయి జిల్లా

వ్యాపారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. ఒకవేళ ఎక్కువ డిమాండ్ చేస్తే రైతులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. మండలాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తాం. అధిక ధరలకు విక్రయించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటాం.

కృత్రిమ కొరత సృష్టించి..

అనంతపురం జిల్లాలో రబీ సీజన్ సంబంధించి మార్చి వరకు యూరియా, డీఏపీతో పాటు ఇతర ఎరువులు కలిపి 80,920 మెట్రిక్ టన్నులు అవసరమని తేల్చారు. యూరియా 25,994 టన్నులు, డీఏపీ, 9455 టన్నులు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. అక్టోబరులో 26 వేల టన్నులు అవసరం. ప్రస్తుతం జిల్లాలో 39 వేల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. హోల్‌సేల్ వ్యాపారులు స్టాక్ లేదని.. ధరలు పెంచి అమ్ముతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఉద్దేశపూర్వకంగానే కృత్రిమ కొరత సృష్టించి.. సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూరియా బస్తా రూ.265కు విక్రయించాల్సి ఉండగా.. రూ.310 వరకు వసూలు చేస్తున్నారు. డీఏపీ రూ.1350కు గాను రూ.1450కు అమ్ముతున్నారు. ఒక్కో బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేయడంతో ఒక్కో రైతుపై రూ.500 నుంచి రూ.1000 వరకు అదనపు భారం పడుతోంది.

కరుణిస్తున్న వరుణుడు



పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లలోకి నీరు చేరుతున్నాయి. అత్యధికంగా గుడిబండ మండలంలో 82.0, అత్యల్పంగా నల్లచెరువులో 2.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. వ్యవసాయ పొలాల్లో తొలగించిన వేరుసెగన, మొక్కజొన్న పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి. చిలమత్తూరు 68.6, లేపాక్షి 65.4, మడకశిర 54.4, నల్లమాడ 41.8, అగళి 38.4, అమరాపురం 32.4, హిందూపురం 30.4, రొళ్ల 29.4, రొద్దం 27.4, కొత్తచెరువు 26.4, గోరంట్ల 26.0, బుక్కపట్నం 25.6, కనగానపల్లి 22.4, సోమందేపల్లి 20.6, రామగిరి 20.2, చెన్నేకొత్తపల్లి 18.2, పరిగి 15.6, పుట్టపర్తి 13.8, పెనుకొండ 10.0, అమడగూరు 8.6, తనకల్లు 3.2, ఓడీసీ 2.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

అధునాతన మీటర్లు కొత్త ఫీచర్లు

- ఉమ్మడి జిల్లాలో విద్యుత్తు సర్వీసులకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు
- మొదటి విడతగా ప్రభుత్వ సర్వీసులకు
- తర్వాత నియంత్రికలు, ఫీడర్లకు..

- ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేయనున్న మొత్తం స్మార్ట్‌మీటర్లు: 2,92,811
- ఉపకేంద్రాల్లో 33కేవీ ఫీడర్ల వద్ద : 187
- ఉపకేంద్రాల్లో 11కేవీ ఫీడర్ల వద్ద : 1056
- అధిక సామర్థ్యం గల నియంత్రికల వద్ద: 11396
- ప్రభుత్వ కార్యాలయాలు : 29,525
- పరిశ్రమల సర్వీసులు : 14,484
- వాణిజ్య సర్వీసులు: 1,20,459
- 220 యూనిట్ల కంటే ఎక్కువగా వినియోగించే గృహ సర్వీసులకు బిగించనున్న మీటర్ల సంఖ్య : 1,16,203

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగంలో ఇక స్మార్ట్‌ఫోన్ల వాడుక పెరగనుంది. తమ సెల్‌లోనే మొబైల్ యాప్ ద్వారా తమ విద్యుత్తు సర్వీసుకు ఎంత మొత్తం కావాలంటే అంత రీచార్జ్ చేసుకోవచ్చు. స్మార్ట్ మీటర్లకు సెల్‌ఫోన్ అనుసంధానంతో మరిన్ని ప్రయోజనాలు ఒనగూరనున్నాయి.

● ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయ మీటర్లు మినహా అన్ని కేటగిరీ సర్వీసులు మొత్తంగా 2,92, 811 సర్వీసులకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు ఎస్పీడీసీఎల్ చర్యలు తీసుకుంది. మొదటి విడతగా జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల సర్వీసులకు స్మార్ట్‌మీటర్లను బిగిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2 వేల సర్వీసులకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మొదటి విడతగా 200 యూనిట్లు వినియోగంపై ఉన్న గృహ సర్వీసులకు, వాణిజ్య, పరిశ్రమల సర్వీసులతోపాటు ఉపకేంద్రాల్లో ఉన్న 11 కేవీ, 33 కేవీ ఫీడర్లకు, అధిక సామర్థ్యం గల నియంత్రికల వద్ద స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు.

ఉపయోగాలెన్నో..

స్మార్ట్‌మీటర్ ఏర్పాటు ద్వారా విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయని విద్యుత్తు అధికారులు తెలుపుతున్నారు. విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు విద్యుత్తు కార్యాలయాలకు వద్దకు వెళ్లి క్యూలో నిల్చుని బిల్లులు కట్టాల్సిన పని ఉండదు. తమ సెల్ ఫోన్‌లో ఎస్పీడీసీఎల్ రూపొందించే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో తమ విద్యుత్తు సర్వీసు నంబరును నమోదు చేసుకుని కట్టవచ్చు. వినియోగదారులు తాము ఎంత మొత్తం రీఛార్జి చేసుకుంటే అంత మొత్తం అయిపోయే వరకు సరఫరా ఉంటుంది. పూర్తైన తరువాత వెంటనే సరఫరా ఆగిపోకుండా కొంత సమయం వరకు వెసులుబాటు ఉంటుంది. రీఛార్జీ గడువు ముగిసే సమాచారం కూడా ముందస్తుగా వినియోగదారు సెల్ నంబరుకు సంక్షిప్త సమాచారం వస్తుందని వెల్లడిస్తున్నారు.



ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్మార్ట్‌మీటర్

● ఎప్పటికప్పుడు మొబైల్ యాప్ ద్వారా తమకున్న విద్యుత్తు సర్వీసుకు రీఛార్జి చేసుకునే సౌకర్యం ఉంటుందని దీనివల్ల అపరాధ రుసుం చెల్లించే పరిస్థితి ఉండదంటున్నారు. మీటర్ రీడింగ్ తీసే సమయంలో తప్పులు దొర్లే పరిస్థితి ఉండదని చెబుతున్నారు.

● స్మార్ట్‌మీటర్‌లో ఏర్పాటు చేసిన ఇన్ బిల్ట్ సిమ్ ద్వారా ఎప్పటికప్పుడు మీటర్‌లో రికార్డు అయ్యే మొత్తం సమాచారం ఆన్‌లైన్ ద్వారా చూసుకునే వీలుంటుంది. ఎన్ని యూనిట్లు వినియోగం జరిగింది, ఎంత రీఛార్జి చేశారు. ఎప్పుడు రీఛార్జి గడువు ముగిసింది.. వంటి పూర్తి వివరాలు నిక్షిప్తం కావటంతోపాటు ఆన్‌లైన్‌లో చూసుకునే వీలుంటుందని అధికారులు పేర్కొన్నారు.

● 11కేవీ, 33 కేవీ ఫీడర్లు, అధిక సామర్థ్యం గల నియంత్రికల వద్ద స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయటం వల్ల ఎంత విద్యుత్తు సరఫరా అవుతోంది. వినియోగం, వృథా ఎంత వంటి వివరాలు ఆయా మీటర్లలో ఉన్న సిమ్‌లలో నిక్షిప్తం అవుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఫీడర్, నియంత్రికలపై హెచ్చు, తగ్గులు సరఫరా అవుతున్నా యాప్‌లో నమోదు అవుతుంది.

బిగింపు ప్రక్రియ జరుగుతోంది

- సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్తుశాఖ

మీటర్ల బిగింపు ప్రక్రియను జులై 2025 లోపు పూర్తిచేయాలని ఒప్పందం మేరకు ఉమ్మడి జిల్లాలో మొదటగా ప్రభుత్వ కార్యాలయాలకు, తర్వాత అన్ని కేటగిరీల సర్వీసులకు మీటర్లను బిగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రక్రియ పూర్తైతే వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి. బిగింపు పూర్తైన తరువాత ఎలాంటి ఫీచర్స్‌ను అందుబాటులోకి తీసుకు వస్తారన్న పూర్తి సమాచారం వస్తుంది. ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న అంశంపైనా వినియోగదారులందరికీ అవగాహన కల్పిస్తాం.

అక్రమార్కుల గుండెల్లో గుబులు

సాధారణ పరీక్షల విభాగంలో నిధుల స్వాహాపై విచారణ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: విద్యాశాఖ సాధారణ పరీక్షల విభాగంలో రూ.లక్షలు నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. దుర్వినియోగంపై ఏప్రిల్‌లో 'ఈనాడు'లో 'పరీక్షల విభాగంలో నిధుల స్వాహా' శీర్షికన కథనం వెలువడింది. అప్పట్లో రూ.16 లక్షలు దుర్వినియోగం అయినట్లు విమర్శలు వచ్చాయి. సుమారు రూ.30 లక్షల వరకూ నిధులు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. ఈ బాగోతంపై విద్యశాఖ ఆర్జేడీ శామ్యూల్ విచారణకు ఓ బృందాన్ని నియమించారు. ఈ బృందంలో చిత్తూరు జిల్లా విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వరరావు, వైఎస్ఆర్ జిల్లా విద్యాశాఖ పర్యవేక్షకులు కుమార్, గుత్తి ఉపవిద్యాశాఖ అధికారి శ్రీదేవి ఉన్నారు. ఆ బృందం విచారణ ప్రారంభించింది.

★ ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సమ్మెటివ్, ఫార్మేటివ్ పరీక్షల ప్రశ్నపత్రాలు, ఓఎమ్మార్ షీట్లు సాధారణ పరీక్షల విభాగం అందిస్తుంది. ఇందుకు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు రుసుం చెల్లిస్తారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు జిల్లా సాధారణ పరీక్షా మండలికి జమచేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం 'అనంత సంకల్పం' పేరుతో పాఠ్యసామగ్రి సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచాలనే ఉద్దేశంతో నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్ కొన్నేళ్లు ఉచితంగా ఈ విభాగం అందిస్తోంది. 2023-24 విద్యాసంవత్సరంలో మెటీరియల్ అరకొరగానే సరఫరా చేశారు. పాఠశాలలో 100 మంది విద్యార్థులుంటే 30, 40 సెట్లు మాత్రమే అందించారు. కొన్ని పాఠశాలలకు అనంత సంకల్పం మెటీరియల్ అందలేదని అప్పట్లో కొందరు ఉపాధ్యాయులు విమర్శలు చేశారు. ఈ మెటీరియల్ ముద్రణలో అక్రమాలు జరిగినట్లు సమాచారం. టెండర్లు లేకుండానే ముద్రణ చేయించారని, కమీషన్ల రూపంలో రూ.లక్షలు దండుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

ఆర్జేడీకి నివేదిక సమర్పిస్తారు

- వరలక్ష్మి, డీఈవో, అనంతపురం

త్రిసభ్య బృందం విచారణ చేశారు. ఆ బృందం ఆర్జేడీకి నివేదిక సమర్పిస్తారు. నివేదిక ఆధారంగా తగిన నిర్ణయం తీసుకుంటారు. డిప్యూటీ డీఈవో పదవి నుంచి తప్పించాలని కోరిన విషయం వాస్తవమే. ఎందుకు పదవి నుంచి తప్పుకోవాలనుకున్నారో తెలియదు.

పర్యావరణంతో ప్రజారోగ్యం పదిలం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్



కోర్టు ఆవరణలో చెత్త తొలగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

అనంతపురం(లీగల్), న్యూస్‌టుడే: నిత్యం ఇరువర్గాల వాదనలను పరిశీలించి తీర్పులు ఇచ్చే న్యాయమూర్తులు పరిశుభ్రత కోసం కట్టారు. ... నిత్యం కోర్టు ఆవరణను సుందరంగా తీర్చిదిద్దారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు అందరూ కలిసి స్వచ్ఛ హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం కోర్టు ఆవరణను శుభ్రం చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ... పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ... వాలన్నారు. జిల్లా అదనపు న్యాయమూర్తులు రాజ్యలక్ష్మి, సాధు బాబు, హరిత, న్యాయమూర్తులు శివప్రసాద్ యాదవ్, శంకర్ రావు, సుజిన్‌కుమార్, శివశంకర్, నగరపాలక కమిషనర్ నాగ రాజు, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు రామ లింగారెడ్డి, నారాయణరెడ్డి, ఉమాపతి పాల్గొన్నారు.

సరస్వతీ నిలయంలో విజ్ఞాన భాండాగారం

బండ్లపల్లి ప్రభుత్వ బడికి హుండాయ్ ట్రాన్సిస్ సంస్థ చేయూత



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు


పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: దీపం వెలుగులో సైతం పుస్తకాలు చదువుకున్న ఎందరో మహనీయులు చరిత్ర సృష్టించారు. పుస్తకాల విలువను గుర్తించిన హుండాయ్ ట్రాన్సిస్ కార్పొరేట్ కంపెనీ అక్షరాల సాక్షిగా రూ.లక్షల విలువ చేసే పుస్తకాల భాండాగారాన్ని సరస్వతీ బిడ్డల కోసం కానుకగా ఇచ్చింది. ఆ అదృష్టం చేసుకున్న సరస్వతీ నిలయం కొత్తచెరువు మండలంలోని బండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. విద్యార్థినేస్తాల అక్షరాభిరుచిని తెలుసుకున్న కంపెనీ ప్రతినిధులు అధునాతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల భవితకు బాటలు వేశారు.

చుట్టూ పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుల బడి, క్రమశిక్షణతో కూడిన విద్యార్థులు, క్రీడల్లో రాష్ట్రస్థాయిలో బహుమతులు పొందిన మట్టిలో మాణిక్యాలు. బహుశా ఇవన్నీ హుండాయ్ కంపెనీ ప్రతినిధులను ఆకర్షించాయేమో.. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్) కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. హుండాయ్ ట్రాన్సిస్ కంపెనీ ఎం.డి. షాంకిల్ జంగ్, సి.హెచ్.ఓ భైంగ్సన కాంగ్, జీఎం కళాసాగర్‌రెడ్డిల ఆధ్వర్యంలో రూ.15 లక్షల వ్యయంతో వందల పుస్తకాలు, ఫర్నీచర్, ఫ్యాన్లు, కుర్చీలు, ర్యాక్‌లతో అధునాతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. భాగవత, రామాయణ, మహాభారత, భగవద్గీత వంటి పురాణ ఇతిహాసాలే కాకుండా.. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, ఆంగ్ల వ్యాకరణం, కథలు, స్ఫూర్తినిచ్చే మహనీయుల జీవిత కథలు, పెద్దబాలశిక్ష, తెలుగు సాహిత్యాలు, జీవిత చరిత్రలు వంటి ఎన్నో వందల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అలాగే హిందూపురంలో కూడా కంపెనీ సెక్రెటరీ అరుణ్‌రెడ్డి నేతృత్వంలో ఈ పుస్తకాల కింద 13 మున్సిపల్ పాఠశాలల్లో ఆధునికీకరణ పనులు చేపట్టారు.



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న హుండాయ్ ట్రాన్సిస్ ఎండీ షాంగ్‌కిల్ జంగ్, కియా సీపీఓ గైసుంగ్ కిమ్

ఇది మాకు దేవాలయం



పుస్తక ప్రపంచాన్ని మాకు అందించిన ట్రాన్సిస్ కంపెనీ ప్రతినిధులకు ధన్యవాదాలు. గ్రంథాలయంలో పుస్తకాలు చదివి ఎన్నో కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం. గొప్పవారి జీవిత కథలు చదవడం ద్వారా స్ఫూర్తి పొంది క్రమశిక్షణను అలవరచుకుంటున్నాం. అందుకే ఈ గ్రంథాలయం మాకు దేవాలయం లాంటిది. **- పరిమళ, 10వ తరగతి**

విద్యార్థులు అదృష్టవంతులు



రూ.15 లక్షలతో వందల పుస్తకాలతో అధునాతన గ్రంథాలయాన్ని మా పాఠశాలకు అందించిన హుండాయ్ ట్రాన్సిస్ కంపెనీ ప్రతినిధులకు మా పాఠశాల ఎప్పటికీ రుణపడి ఉంటుంది. పుస్తకాలు కొనలేని పేద విద్యార్థులకు ఈ గ్రంథాలయం ఒక వరం లాంటిది. ఈ సువర్ణవకాశం పొందిన విదార్థులు అదృష్టవంతులు. **- కె.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయుడు**

ఏడీసీఏ గ్రామీణ క్రికెట్ పోటీల్లో ధర్మవరం విజయం



హస్మిత



కార్తీక

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆర్డీటీ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ క్రికెట్ లీగ్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. శనివారం పట్టణంలోని ఆర్డీటీ క్రికెట్ మైదానంలో జరిగిన పోటీల్లో బాలికల అండర్-16 విభాగంలో హిందూపురం, ధర్మవరం జట్లు తలపడ్డాయి. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన హిందూపురం జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 165 పరుగులు చేసింది. కార్తీక 77 పరుగులతో రాణించింది. అనంతరం ఛేదనలో ధర్మవరం బాలికల జట్టు కేవలం 19 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ధర్మవరం జట్టులో హస్మిత 55 పరుగులు చేసి జట్టును గెలిపించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 18 జట్లు పాల్గొంటాయని శిక్షకుడు రాజశేఖర్, ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు తెలిపారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం : మంత్రి సవిత



మాట్లాడుతున్న బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే : రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన రోజు 16,457 ఉపాధ్యాయ ఉద్యోగాలతో మెగా డీఎస్సీపై సంతకం చేశారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాలు పోటీ పరీక్షల్లో సత్తా చాటాలన్న ఉద్దేశంతో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అందులో భాగంగా పెనుకొండలో కేంద్రంలో ప్రారంభిచామన్నారు. 2 నెలలపాటు ఉచిత శిక్షణతోపాటు అభ్యర్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ. 1,500, పుస్తకాలకు రూ.1,000 అందిస్తామన్నారు. బీసీ స్టడీ సర్కిళ్లు బలోపేతం చేసి అన్ని పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేలా ప్రణాళికలు రూపొందిచామన్నారు. భవిష్యత్తులో నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా అన్ని రకాల ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు డీఎస్సీలో సత్తాచాటి అత్యధికంగా జిల్లా నుంచి ఉద్యోగాలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి నిర్మలజ్యోతి, ఏబీసీడబ్ల్యూఓ గంగాధర్, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లాలో బిందు, తుంపర సేద్యం పథకం 37,500 హెక్టార్లకు మంజూరైంది. రైతు వాటా చెల్లించిన రైతులకు పరికరాలు కంపెనీలు సరఫరా చేస్తున్నాయి. సకాలంలో రైతు పొలాల్లో పరికరాలు అమర్చేందుకు ఫిట్టర్ల కొరత ఎక్కువగా ఉంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పదో తరగతి ఉత్తీర్ణత, అనుత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి తెలిపారు. ఈనెల 15లోపు నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని పీడీ కోరారు. సమాచారం, సందేహాల నివృత్తి కోసం అనంతపురంలోని రైతు బజారు అవరణలో ఉన్న ఏపీఎంఐపీ కార్యాలయంలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

జడ్పీ ఉప సీఈఓగా వెంకటసుబ్బయ్య బాధ్యతల స్వీకారం



జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మను కలిసిన ఉప సీఈఓ వెంకటసుబ్బయ్య

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా ప్రజాపరిషత్తు నూతన ఉప సీఈఓగా జి.వెంకటసుబ్బయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత జడ్పీ ఛైర్‌పర్సన్ బి.గిరిజమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్‌లను మర్యాద పూర్వకంగా కలిసిన తర్వాత లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. కడప డీఎల్‌డీఓగా ఉన్న ఆయనను ఇటీవల జరిగిన బదిలీలో అనంతపురం జడ్పీ ఉప సీఈఓగా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఉప సీఈఓగా ఉన్న లలితాబాయిని అనంతపురం డీఎల్‌డీఓగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. కడప జిల్లాలోని వివిధ మండలాల్లో ఎంపీడీఓగా ఆయన 22 ఏళ్లకు పైగా పనిచేశారు. రెండేళ్ల క్రితం డీఎల్‌డీఓగా పదోన్నతి లభించింది. ప్రస్తుతం సీఈఓ పోస్టు కూడా ఖాళీగా ఉన్నందున ఇతనికే ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పాలకవర్గాన్ని సమన్వయం చేసుకుని జడ్పీని ప్రగతి బాటలో నడిపించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. జడ్పీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, పలువురు ఎంపీడీఓలు, ఏఓలు, ఆయనను అభినందించారు.

రాష్ట్రస్థాయి పారా క్రీడాపోటీల్లో జిల్లాకు మూడు పతకాలు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పారా క్రీడాపోటీల్లో జిల్లాకు మూడు పతకాలు లభించాయి. జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించిన మోహన్ కృష్ణ ఈత ఫ్రీస్టైల్ విభాగంలో పోటీ పడి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. ఈతలో ఈ క్రీడాకారుడు రెండు పతకాలు చేజిక్కించుకోవడం విశేషం. పారా రైఫిల్ షూటింగ్‌లో వెంకట రమణ పసిడి పతకంతో మెరిశాడు. పతకాలతో తిరిగొచ్చిన పారా క్రీడాకారులను జిల్లా క్రీడల అభివృద్ధి ఇన్‌ఛార్జి అధికారి అనిల్‌కుమార్ అభినందించారు. జాతీయ స్థాయి పారా క్రీడల్లో కూడా రెట్టింపు ఉత్సాహంతో ఆడి పతకాలతో తిరిగి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

టమాటా ధరలు తగ్గుముఖం

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌లో 4 రోజులుగా టమాటా ధరలు తగ్గుముఖం పట్టాయి. జిల్లా అంతటా ఆకాశం మేఘావృతం కావడం, రెండ్రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో టమాటా కాయలకు మచ్చలు వచ్చే అవకాశం ఉందని, వర్షానికి తడిసి కాయలు నాణ్యత తగ్గి, రవాణాకు పనికి రాకుండా పోతాయని వ్యాపార్గ వర్గాలు తెలిపాయి. కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో ధరలు అమాంతంగా పడిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మూడ్రోజుల క్రితం టమాటా కిలో రూ.77 ఉండగా శనివారం కిలో రూ.51 పడిపోయింది. కిలో టమాటాపై రూ.20-26 తగ్గింది. మార్కెట్‌కు శనివారం మొత్తం 675 టన్నులు వచ్చాయి. ధరలు పరిశీలిస్తే కిలో టమాటా గరిష్ఠం రూ.51, మధ్యస్థం రూ.40, కనిష్ఠం రూ.27 పలికింది. అదే 15 కిలో బుట్ట ధర రూ.కనిష్ఠం రూ.765, మధ్యస్థం రూ.600, కనిష్ఠం రూ.405 పలికిందని మార్కెట్ ఇన్‌ఛార్జి రాంప్రసాద్‌రావు తెలియజేశారు.

అత్యాచార నిందితుడిపై పోక్సో కేసు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్సై వెంకటనారాయణ

అమడగూరు, న్యూస్‌టుడే: బాలికపై ఏడాది నుంచి అత్యాచారం చేయడంతోపాటు గర్భం దాల్చడానికి కారణమైన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పుట్టపర్తి మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ వివరించారు. అత్యాచార సంఘటనకు సంబంధించి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలిక అమడగూరు పాఠశాలలో చదువుకోవడానికి వచ్చేది. అదే గ్రామానికి చెందిన యువకుడు కూడా పాఠశాల సమీపంలోనే చిల్లర దుకాణం నిర్వహించేవాడు. బాలికకు వరుసకు అన్న అయిన ఈ యువకుడు తినుబండారాలు ఇస్తూ లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఏడాది నుంచి తరచూ లైంగిక దాడికి పాల్పడుతుండేవాడు. అమ్మాయికి నాలుగు రోజుల కిందట కడుపు నొప్పి రావడంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం కర్ణాటకకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ప్రస్తుతం మూడు మాసాల గర్భిణి అని నిర్ధారించడంతోపాటు కర్ణాటక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అమడగూరు పోలీసులు, ఎస్పీకి సమాచారం అందజేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధితురాలిని బాలిక సంరక్షణ కేంద్రానికి (సీడబ్ల్యూసీ) తరలించారు. సమావేశంలో ఎస్సై వెంకటనారాయణ పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్ల టోకరా

సోమందేపల్లి, న్యూస్‌టుడే : సోమందేపల్లిలో నివాసం ఉంటున్న ఓ మహిళ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయింది. గుంతకల్లు ప్రాంతానికి చెందిన ఆమె భర్త కియా అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్నారు. వారు సోమందేపల్లిలో నివాసం ఉంటున్నారు. చరవాణి యాప్ ద్వారా పరిచయమైన మహిళ మూడింతల సొమ్ము అందిస్తామని ఆమెకు తెలిపింది. సోమందేపల్లికి చెందిన మహిళ రూ.3 లక్షలు సొమ్మును ఫోన్‌పే ద్వారా పంపి.. తన ఖాతాకు రూ.9 లక్షలు మొత్తం జమ చేస్తారని ఎదురుచూసింది. మూడు రోజులైనా ఎలాంటి సమాధానం రాకపోవడంతో చివరకు తాను మోసపోయినట్లు గుర్తించి శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. సొమ్ము తిరుపతిలోని ఖాదికాలనీలో ఉన్న కరూర్ వైశ్యా బ్యాంకులో అరక్ విజయ్‌శరత్ వ్యక్తి ఖాతాకు చేరినట్లు గుర్తించినట్లు బాధిత దంపతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని వారు పోలీసులను వేడుకున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరు యువకుల దుర్మరణం

ముప్పలకుంటలో విషాదం



వన్నూరుస్వామి



లక్ష్మీకాంత్

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడి ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. బొజ్జప్ప, తమ్మక్కల కుమారుడు లక్ష్మీకాంత్(19), గోవిందప్ప, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు వన్నూరుస్వామి(21), మరో యువకుడు ధనుష్ స్నేహితులు. లక్ష్మీకాంత్, వన్నూరుస్వామి గొర్రెలు, మేకలు మేపుకొనేవారు. శుక్రవారం జీవాలను మేపుకొని ఇంటికి వచ్చారు. రాత్రి భోజనం చేశాక ముగ్గురు కలిసి బొజ్జప్ప అనే రైతు తోటలో సేద్యం చేసేందుకు ట్రాక్టర్ తీసుకువెళ్లారు. రోటావేటర్‌తో సేద్యం చేస్తుండగా భారీ వర్షం కురిసింది. పని మధ్యలోనే ఆపేసి ట్రాక్టరులో ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. వన్నూరుస్వామి, లక్ష్మీకాంత్ ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. ధనుష్ ప్రాణాలతో బయటపడ్డాడు. అతడు గ్రామానికి వెళ్లి విషయం చెప్పాడు. మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు యువకుల మృతదేహాలను పంచనామా కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బ్రహ్మసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన నాయకుడి చీనీ చెట్ల నరికివేత



చీనీ చెట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి (ధర్మవరం, న్యూస్‌టుడే): బత్తలపల్లి మండలం తంబాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు రమణారెడ్డికి చెందిన వ్యవసాయతోటలో శుక్రవారం రాత్రి 53 చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. శనివారం గమనించిన రమణారెడ్డి బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రెండు ఎకరాల పొలంలో చీనీ సాగు చేస్తున్నానని, 370 చెట్లు ఉండగా వాటిలో రెండు ఏళ్ల వయసున్న 53 చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారని రమణారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. బత్తలపల్లి ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. జనసేన పార్టీ బత్తలపల్లి మండల అధ్యక్షుడు రవి, తదితరులు గ్రామానికి వెళ్లి చీనీతోటను పరిశీలించి రైతుతో మాట్లాడారు.

వివాహిత ఆత్మహత్య

కదిరి పట్టణం: కదిరి పట్టణం పార్థసారథికాలనీలో రమణమ్మ(58) అనే వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యులు, కదిరి పట్టణ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. రమణమ్మ భర్త కొవిడ్ సమయంలో మృతి చెందారు. ఇద్దరు కుమారులు ఉపాధి కోసం ఒకరు బెంగళూరు, మరొకరు హిందూపురం వెళ్లి అక్కడే ఉంటున్నారు. వెన్నునొప్పితో కొంతకాలంగా బాధపడుతున్న రమణమ్మ చికిత్స తీసుకున్నా నయం కాలేదు. వెన్నునొప్పి బాధను భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

కబ్జా కోరల్లో వక్ఫ్ బోర్డు భూములు

విపణి ధర రూ.80 కోట్లు పైమాటే



టి.కొత్తపల్లిలోని వక్ఫ్ బోర్డు భూమిలో పంట సాగు

గుత్తి, న్యూస్‌టుడే : వక్ఫ్ బోర్డు అధికారుల నిర్లక్ష్యం, రెవెన్యూ అధికారుల అలసత్వంతో గుత్తి పట్టణంతోపాటు గుంతకల్లు గ్రామీణంలో రూ.80 కోట్ల విలువైన వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతమయ్యాయి. దీనిపై పలువురు ఆక్రమణదారులతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా తయారైంది.

అధికారుల అండతో ఆక్రమణల పర్వం

- గుత్తిలోని సర్వే నంబర్ 601, 603-బీ, 410, 414, 604, 603-ఏలలోని రూ.కోట్లు విలువైన స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. భూములు, స్థలాలను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడుతూ ఆక్రమణదారులకు వక్ఫ్ బోర్డు ఆస్తులపై చట్టబద్ధత కల్పిస్తున్నారు. ఏకంగా పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేశారు.
- గుత్తి పట్టణంలోని నిజామీ షాదీఖానా వద్ద కొందరు స్థలాలను లీజుకు తీసుకుని శాశ్వత కట్టడాలు నిర్మించారు. రాజకీయ అండదండలున్న వారు స్థలాలను ఆక్రమిస్తున్నారు.
- పాతహైవేకు ఇరువైపులా ఉన్న సుమారు 10 ఎకరాల స్థలాన్ని కబ్జా చేశారు. కొందరు భవంతులు నిర్మించుకున్నారు. మరికొందరు దుకాణ సముదాయాన్ని నిర్మించుకుని అద్దెలు తీసుకుంటున్నారు.
- ఓ వ్యక్తికి రెవెన్యూ అధికారులు ఇంటి పట్టా ఇచ్చారు. వక్ఫ్ బోర్డు స్థలానికి రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చి డబ్బులు వెనకేసుకున్నారని చర్చ జరుగుతోంది.
- బీసీ కాలనీలోని ఐదెకరాల భూమిలో కొందరు ప్లాట్లు వేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈవిషయం తెలిసినా వక్ఫ్‌బోర్డు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.
- గుంతకల్లు మండలంలోని నక్కన దొడ్డి నరసాపురంలోని సర్వేనంబర్ 729లో 19,40 ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. రూ.30 కోట్లు విలువైన భూమిని ఆరుగురు ఆక్రమించారు. ఎంచక్కా బోరుబావులు తవ్వుకుని తోటలు సాగు చేస్తున్నారు. ఐదేళ్ల కిందట రెవెన్యూ అధికారులు లోపాయికారిగా ఆరుగురికి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారు. 8నెలల కిందట 'ఈనాడు'లో కథనాన్ని ప్రచురించగా రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు.
- గుత్తి మండలంలోని టి.కొత్తపల్లిలో సర్వేనంబర్ 89లో 20.60 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. ఇందులో ఆరు ఎకరాలు ఆక్రమించారు. కొందరు ఇళ్లను నిర్మిస్తున్నారు. మరికొందరు పంటలు సాగు చేస్తున్నారు. ఇక్కడ ఎకరా రూ.30లక్షలు ధర ఉంది. అధికారుల పర్యవేక్షణలోపం వల్ల రూ.18 కోట్ల భూమి అన్యాక్రాంతం అయింది. వక్ఫ్ బోర్డు అధికారులు మసీదులు, దర్గాల ఆస్తులు ఎక్కడెక్కడున్నాయో చూడటంలేదు.

సహకారం కోరితే ఆక్రమణలు తొలగిస్తాం

వక్ఫ్ బోర్డు అధికారులు తమ సహకారం కోరితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. తామంతటతామే ఆక్రమణల తొలగింపునకు వెళ్లలేం. తమకు లిఖిత పూర్వకంగా లేఖ ఇస్తే ఆక్రమణల తొలగింపునకు సహకారం అందిస్తాం.

-ఓబులేసు, తహసీల్దారు, గుత్తి

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

అలరించిన నృత్య ప్రదర్శన


నాట్యం చేస్తున్న బాలికలు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలోని కల్యాణ మండపంలో శనివారం రాత్రి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన అలరించింది. వాసవీ భజన మహిళా మండలి వారు అమ్మ వారికి హారతుల సమర్పిస్తూ, స్థానిక శ్రీసాయి సంగీత నృత్యాలయం చిన్నారులు సాయిచైత్ర, సంహిత చేసిన ఓం నమః శివాయ.. అంటూ భరతనాట్య నృత్య ప్రదర్శన మహిళలను విశేషంగా ఆకట్టుకుంది.

ఉగ్రనారసింహా నమోస్తుతే...!

హిందూపురం అర్బన్ : పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఉన్న పేట వేంకటరమణస్వామి దేవాలయంలో శనివారం శ్రీనివాసునికి నాగులపడకతో కూడిన ఉగ్రనారసింహుని అలంకరణ చేశారు. ఈ అలంకరణ భక్తులకు ఆకట్టుకోవడంతో ఆసక్తిగా తిలకించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, అర్చకులు రామాయణ చరణ్ భక్తులకు సదుపాయాలు కల్పించారు.


హిందూపురం సాంస్కృతికం : ఉగ్రనారసింహుడిగా పేట వేంకటరమణుడు

నేటి నుంచి అగళి సంత

అగళి, న్యూస్‌టుడే : అగళి సంత ఆదివారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు సర్పంచి లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి రంగనాథ్ తెలిపారు. కొవిడ్-19 కారణంగా సంతను ఆపేశారు. తిరిగి ప్రస్తుతం ప్రారంభిస్తున్నామన్నారు. కూరగాయలు, ఆకుకూరలు, కిరాణ దుకాణాలు, పశువులు, జీవాల వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ

హిందూపురం, న్యూస్‌టుడే : హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమితులైన లింగన్నకు పూర్వపు సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్ శుక్రవారం రాత్రి పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడుతూ ఆసుపత్రిలో సేవలు, ఇతర సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. తాను ఆసుపత్రిలో ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు.

వెలుగు ఏపీఎంగా మదన్‌మోహన్

సోమందేపల్లి, న్యూస్‌టుడే : స్థానిక వెలుగు ఏపీఎంగా మదన్‌మోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఆత్మకూరు నుంచి ఇక్కడికి బదిలీకాగా ఇక్కడ ఐదేళ్లుగా పనిచేస్తున్న ఏపీఎం రామాంజనేయులు హిందూపురానికి బదిలీ అయ్యారు.

పాలసముద్రం కూడలిలో నిర్మాణాలు చేపట్టొద్దు

గోరంట్ల, న్యూస్‌టుడే : గోరంట్ల మండలంలోని పాలసముద్రం కూడలిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థల వివాదం కోర్టులో ఉన్నందున ఎలాంటి నిర్మాణాలు జరపరాదని తహసీల్దారు మారుతి ఆదేశాలు జారీచేశారు. ఈ స్థలం కొన్నేళ్లుగా వివాదాల నడుమ కొనసాగుతున్న నేపథ్యంలో శనివారం తహసీల్దార్ పరిశీలించారు. కోర్టు నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

సీడీపీఓ వైఖరిపై ఫిర్యాదులు

హిందూపురం, న్యూస్‌టుడే : హిందూపురం సీడీపీఓ రమణమ్మ సూపర్‌వైజర్లు, కార్యకర్తలపై వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ శనివారం రాత్రి ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యాలయం వద్దకు చేరుకుని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్రకు ఫిర్యాదు చేశారు. 9 మంది సూపర్‌వైజర్లు, దాదాపు 50 మంది వరకు చిలమత్తూరు, ఇతర మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు వచ్చి రాత్రి ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శిని కలిసి సీడీపీఓపై ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ వీటిపై దర్యాప్తు చేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

ఇరువర్గాల వాగ్వాదం

పెనుకొండ, న్యూస్‌టుడే : స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకొనేందుకు వ్యాపారులు, నాయకులు పోటీపడ్డారు. ఈ క్రమంలో సోమందేపల్లి మద్యం దుకాణాలకు ఎవరూ దరఖాస్తు చేయకూడదని ఓ నాయకుడు హుకుం జారీ చేశాడు. మరో వర్గానికి చెందిన పెనుకొండ వ్యక్తి సోమందేపల్లికి దరఖాస్తు చేస్తామని వెళ్లగా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఎక్సైజ్ కార్యాలయం వద్ద పరిశీలించారు. దరఖాస్తుదారులు ఎక్కువ ఉండడంతో ఇద్దరు కానిస్టేబుళ్లను బందోబస్తు ఉంచారు.

ఆగిన రోడ్డు నిర్మాణం..

❒ ఐదేళ్లు పట్టించుకోని వైకాపా ప్రభుత్వం ❒ కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

అవస్థల ప్రయాణం

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే : ఆ గ్రామానికి నేటికీ రోడ్డు వసతి లేకపోవడం కారణంగా స్థానిక యువతకు పెళ్లి సంబంధాలు కుదరడం లేదంటే అతిశయోక్తి కాదు. ఇదెక్కడో కాదు.. అంతర్జాతీయ స్థాయి కియా ఇండియా కార్ల తయారీ పరిశ్రమ వెనుక ఉన్న గ్రామంలో పరిస్థితి. పెనుకొండ మండలంలోని మునిమడుగు గ్రామ పంచాయతీ మోటువారిపల్లి గ్రామానికి వందేళ్ల చరిత్ర ఉంది. ఆనాటి నుంచి ఈనాటి వరకు మోటువారిపల్లి నుంచి చిన్నపరెడ్డిపల్లి మీదుగా అమ్మవారిపల్లి వరకు సుమారు 4 కిలో మీటర్లు మట్టిరోడ్డే దిక్కు. స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తయినా ఆ గ్రామానికి కనీసం తారురోడ్డు లేకపోవడం శోచనీయం.

తెదేపా పాలనలో భూమిపూజతో సరి

గ్రామానికి తారురోడ్డు నిర్మాణానికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2019 జనవరి 22న ఎమ్మెల్యే బీకే పార్థసారథి రూ.3.42 కోట్లతో భూమి పూజచేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా అభివృద్ధి పనులు నిలిపివేసింది. పనులు అటకెక్కించింది. గత ఐదేళ్లలో రోడ్డు ఊసేలేకుండాపోయింది. ఫలితంగా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమ్మవారిపల్లి వద్ద 44వ జాతీయ రహదారి నుంచి చిన్నపరెడ్డిపల్లి, మోటువారిపల్లి గ్రామాలకు తారురోడ్డు లేక ప్రజలు పడే ఇబ్బందుల గురించి గత పాలకులు పట్టించుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు నిర్మాణం జరుగుతుందని గ్రామస్థులు ఆశలు పెట్టుకున్నారు. నాడు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన బీకే పార్థసారథి ప్రస్తుతం ఎంపీగా ఉన్నారు. ఆయన ఎంపీ నిధులు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మోటువారిపల్లిరోడ్డు పై నడిచేందుకు అవస్థలు పడుతున్న మహిళ

రోడ్డు లేదని పెళ్లి నిలిచింది

గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక అత్యవసర సమయంలో 108 కూడా రాదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టిరోడ్డు పై గుంతల్లో నీరు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. ఆటోలు కూడా గ్రామానికి రావడంలేదు. ఇటీవల గ్రామానికి చెందిన ఓ యువకుడికి వివాహం నిశ్చయం కోసం వచ్చిన వారు పల్లెకు రోడ్డు బాగాలేదని పెళ్లి సంబంధం రద్దు చేసుకున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు రోడ్డు నిర్మించాలి. **- చంద్ర, గ్రామస్థుడు**

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఇటీవల ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.5 కోట్లల్లో చిన్నపరెడ్డిపల్లి గ్రామం వద్ద కల్వర్టు నిర్మించేందుకు నివేదికలు పంపాం. ప్రతి సంవత్సరం మంజూరయ్యే నిధుల్లో విడతల వారీగా రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశాం. గతేడాది ఉపాధి హామీ నిధులతో చిన్నపరెడ్డిపల్లి రోడ్డులో రూ.15 లక్షలతో 230 మీటర్ల సిమెంటు రోడ్డు నిర్మించారు. ఉన్నతాధికారుల దృష్టికి రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. **- విశ్వనాథ్, ఇంజినీరింగ్ సహాయకుడు, మునిమడుగు**

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య : గొంగటిపల్లి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారిలో కంపచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- రామలక్ష్మమ్మ, స్థానికురాలు**

సమాధానం : వెంటనే సిబ్బందిని పంపి కంపచెట్లను తొలగిస్తాం. **- ఆదినారాయణ, సర్పంచి, లేపాక్షి**

సమస్య : చోళసముద్రం నుంచి నాగానిపల్లికి వెళ్లే దారిలో చెత్తకుప్పలు ఉన్నాయి. **- రామక్రిష్టప్ప, స్థానికుడు**

సమాధానం : సిబ్బందితో శుభ్రతా చర్యలు చేపడతాం. **- నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి, చోళసముద్రం.**

సమస్యల పరిష్కారం...

స్పందనకు వందనం

మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు 'ఈనాడు'లో ప్రచురితమయ్యే 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో సంబంధిత బాధ్యులు స్పందించి పరిష్కరించారు. కంచిసముద్రం పంచాయతీ బయన్నపల్లిలో మురుగు రహదారిపైకి రాకుండా కార్యదర్శి రమేశ్ పారిశుద్ధ్య కార్మికులతో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. కంచిసముద్రం ఎస్సీ కాలనీలో వీధులను శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, లేపాక్షి

పెనుకొండలో గార్మెంట్స్ ఏర్పాటుకు చర్యలు


గార్మెంట్స్ ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ: పెనుకొండలో గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటుకు మంత్రి సవిత చర్యలు తీసుకుంటున్నారు. శనివారం తన నివాసంలో ఇండియన్ గార్మెంట్స్ ఎక్స్‌పోర్ట్స్ పరిశ్రమ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో పెనుకొండ ప్రాంతంలో పరిశ్రమ స్థాపించడానికి ఉన్న అవకాశాలపై మంత్రి చర్చించారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్ఆర్ మహేశ్, జీఎంలు రత్నాకర్‌రెడ్డి, విశ్వనాథ్, మేనేజర్ సుజాత పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించడమే లక్ష్యం


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

మడకశిర, న్యూస్‌టుడే : అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయడమే లక్ష్యంగా అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో శనివారం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తిలు హౌసింగ్ అధికారులతో సమావేశమై ఇళ్ల మంజూరు పై చర్చించారు. రెవెన్యూ అధికారులు పట్టణ సమీపంలో 50 ఎకరాల భూములను సేకరించాలని సూచించారు.

తెదేపాలో చేరిన వైకాపా సర్పంచి

అగళి : మండలంలోని ఆర్.జి.పల్లిలో శనివారం నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి సన్నమ్మ భర్త రంగప్ప, తన అనుచరులైన 50 కుటుంబాలతో కలిసి తెదేపాలో చేరారు. కార్యక్రమంలో వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, రాష్ట్ర తెదేపా కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, జడ్పీటీసీ సభ్యుడు ఉమేశ్, కన్వీనర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం

అమరాపురం: హేమావతిలో ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి తెలిపారు. శనివారం బస్టాండు పక్కన శౌచాలయం, స్నానపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసమూర్తి, గణేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనునాయక్, ఏఈ హరి, ఎంపీడీఓ రామారావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పరిగి, న్యూస్‌టుడే : చట్టాలపై మహిళలు, ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని హిందూపురం అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శనివారం పరిగి వెలుగు కార్యాలయంలో జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కక్షలు, కార్పణ్యాల జోలికి వెళ్లకుండా శాంతి సామరస్యంతో మెలగాలని సూచించారు. సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న మోసాలను గుర్తెరిగి ఎప్పటికప్పుడు చైతన్యవంతులు కావాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్, సీనియర్ న్యాయవాదులు కళావతి, గోపాలకృష్ణ, తహసీల్దార్ హసీనాసుల్తానా, పెనుకొండ సీఐ రాఘవన్, ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకులు అశ్వర్థప్ప, ఏపీఎం రామేశ్వర్‌రెడ్డి, లోక్ అదాలత్ సిబ్బంది, మండల సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


పెనుకొండ, న్యూస్‌టుడే : పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా జూనియర్ సివిల్ జడ్జి బుజ్జప్ప, అదనపు జూనియన్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ ఆధ్వర్యంలో సిబ్బంది, న్యాయవాదులు, పోలీసులు, నగర పంచాయతీ సిబ్బందితో కలసి కోర్టు ఆవరణాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడప్పుడు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం చేపడుతుంటే కోర్టు ప్రాంగణం, పరిసరాలు శుభ్రంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, బార్‌అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హిందూపురం : పరిసరాలు శుభ్రంగా ఉంచటంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు న్యాయమూర్తి, సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్, సిబ్బంది చీపురుపట్టి కోర్టు ఆవరణంలో ఉన్న చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు న్యాయమూర్తి, సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, సిద్ధు, గోపాలకృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.


కోర్టు ఆవరణలో చెత్తతొలగిస్తున్న జడ్జిలు, న్యాయవాదులు, సిబ్బంది

అమ్మ అలంకారం.. అపురూపం


హిందూపురం సాంస్కృతికం : అన్నపూర్ణేశ్వరిదేవిగా గాయత్రిదేవి


లేపాక్షిలో అన్నపూర్ణేశ్వరిగా దుర్గాదేవి


పెనుకొండలో..


గోరంట్లలో..

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో శనివారం దేవతామూర్తులు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాల్లో మహిళలు కుంకుమార్చనలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. – న్యూస్‌టుడే బృందం


రొళ్ల : రత్నగిరి కొల్లాపురి మహాలక్ష్మి


కంసలపేటలో ముత్యాలంకరణతో చౌడేశ్వరిదేవి

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

హిందూపురం, న్యూస్‌టుడే : పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన మహిళ (25) అదృశ్యం కావటంపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం 11.35 గంటల ప్రాంతంలో తలనొప్పి అని భర్తకు ఆమె ఫోన్ చేసి చెప్పింది. అతను వెంటనే ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో భార్య లేకపోవటంతో బంధువులకు సమాచారం అందించాడు ఆమె ఆచూకీ తెలియకపోవటంతో స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమందేపల్లిలో యువతి..

సోమందేపల్లి, న్యూస్‌టుడే : మండలానికి చెందిన యువతి (20) శుక్రవారం నుంచి కనిపించడం లేదనే ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేశ్‌బాబు తెలిపారు. తమ బంధువుల గ్రామాల్లో ఆమె ఆచూకీ కోసం వాకబు చేసినా ప్రయోజనం లేకపోవడంతో తల్లిదండ్రులు శనివారం ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

పోలీసుల అదుపులో దొంగలు

గోరంట్ల : మహిళల మెడలోని బంగారు గొలుసులతో ఉడాయించే ఇద్దరు దొంగలను గోరంట్ల పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల గోరంట్ల మండలంలోని ఎముకలగుట్టపల్లిలో ఆధార్‌కార్డు పరిశీలన పేరుతో ఇద్దరు కొత్త వ్యక్తులు వచ్చి ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. కేసు నమోదు చేసిన పోలీసులు చేపట్టిన దర్యాప్తులో ఇద్దరు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించాల్సి ఉంది.

ఇలా అయితే రాకపోకలు ఎలా..?



రొద్దంలోని సుబ్బరాయప్పకొట్టాల నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్డు వర్షానికి అధ్వానంగా మారింది. సమీప పెన్నానదిలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు ఈ మార్గంగుండా వెళ్తుండటంతో మట్టిరోడ్డు గుంతలు పడి రాకపోకలు సాగించలేని దుస్థితికి చేరింది. వర్షానికి మట్టి దారి అధ్వానంగా మారడంతో కనమర, బూచెర్ల, నాగిరెడ్డిపల్లి కుర్లపల్లి, రాచూరు, జక్కలచెరువు గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రొద్దం ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రామ్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, రొద్దం

స్నేహితుల ఆర్థిక చేయూత


స్నేహితుడికి నగదు అందజేస్తున్న మిత్రులు

గోరంట్ల, న్యూస్‌టుడే : ఆపదల్లో ఉన్న చిన్ననాటి మిత్రులకు మేమున్నామంటూ సహచరులు ఆర్థిక సాయం అందజేసి వారి కష్టాల్లో పాలుపంచుకుంటూ దాతృత్వాన్ని చాటుకున్నారు. వారే గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో 1986-87లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు. ఆనాడు తమతో కలిసి చదువుకున్న మిత్రులు అబ్దుల్లా, ఇర్షాద్ ఆరోగ్యపరంగా, పిల్లలను చదివించే విషయంలో ఇబ్బంది పడుతున్నట్లు తెలియడంతో వెంటనే స్నేహితులు స్పందించారు. వాట్సాప్ గ్రూప్‌లో మిత్రులందరికీ సమాచారం చేరవేశారు. దీంతో రూ.1.86 లక్షలు పోగయ్యాయి. వారు చదువుకున్న బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం సమావేశం ఏర్పాటు చేసి ఇద్దరు మిత్రులను ఆహ్వానించి అబ్దుల్లాకు రూ.1.35 లక్షలు, ఇర్షాద్‌కు రూ.51 వేలు అందజేశారు. నగదు అందజేసిన బృందంలో స్థానిక ప్రధానోపాధ్యాయుడు నౌషాద్, ప్రభాకర్‌రెడ్డి, మురళీ, విజయశేఖర్, షమీవుల్లా, అజ్మతుల్లా, షబ్బీర్, శివప్ప, వెంకటరంగారెడ్డి, పద్మావతి, ఉపాధ్యాయులు రామకృష్ణ, మంజునాథ్, తిరుపాల్‌నాయక్ ఉన్నారు.

చెరువులో పడి మహిళ ఆత్మహత్య

పరిగి : మండలంలోని ధనాపురం ఎస్సీ కాలనీకి చెందిన వివాహిత మాధవి (31) పరిగి చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పరిగి ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మడకశిర మండలం బుళ్లసముద్రం గ్రామానికి చెందిన ఆమెకు పరిగి మండలం ధనాపురం ఎస్సీ కాలనీకి చెందిన లక్ష్మీనారాయణతో ఆరేళ్ల కిందట వివాహమైంది. మాధవి అనారోగ్యంతో బాధపడుతోంది. తరచూ ఆమె ఇంటిపట్టున ఉండకుండా తిరుగుతుండేది. రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన మాధవి పరిగి చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. శనివారం ఉదయం మృతదేహం తేలింది. శవపరీక్ష నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మాధవి అక్క రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆమెకు భర్త లక్ష్మీనారాయణతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు.

ఉరి వేసుకుని కూలీ..

చిలమత్తూరు: మండలంలోని పలగలపల్లి చెందిన రియాజ్ (48) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ మునీర్‌అహ్మద్ తెలిపిన వివరాలు మేరకు.. రసూల్‌సాబ్ కుమారుడు రియాజ్ రోజువారీ కూలీగా పనిచేస్తు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య నూర్జహన్ గొడవపడటంతో మనస్తానికి గురైన రియాజ్ నిర్మాణంలో ఉన్న ఇంట్లో ఉరి వేసుకుని మృతిచెందాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి..

హిందూపురం : హిందూపురం గ్రామీణ మండలం దేవరపల్లి రైల్వేస్టేషన్ సమీప ప్రాంతంలో శనివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి (35) మృతి చెందినట్లు గ్రామీణ అప్‌గ్రేడ్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా మృతుని శరీరంపై ఎలాంటి గాయాలు లేక పోవటం, మృతదేహం పక్కన విషం బాటిల్ పడి ఉండటంతో అతను ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అతనికి సంబంధించి ఎలాంటి వివరాలు లభించలేదని పోలీసులు తెలిపారు.

గాలి వీచినప్పుడల్లా భయం



రొళ్ల మండలంలోని ఆర్.గొల్లహట్టిలో దిన్నేహట్టికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్తు తీగలు పచ్చని చెట్లల్లో తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. గాలి వీచినప్పుడు, వర్షం వస్తున్న సమయంలో చెట్ల కొమ్మలు తీగలకు తగిలి నిప్పులు చెలరేగుతున్నాయి. ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి చెట్లను తొలగించి తీగల ఎత్తు పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్తు ఏఈ నిజాముద్దీన్‌ను వివరణ కోరగా లైన్‌మెన్‌ను పంపించి చెట్లను తొలగించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, రొళ్ల

కాలువల్లేక మురుగు రోడ్డుపై పరుగు



గోరంట్లలోని మార్కెట్ యార్డు నుంచి వెళ్లే హిందూపురం రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు తమ ఇళ్లనుంచి వచ్చే వృథానీటిని రోడ్లపైకి వదులుతుండటంతో పరిసరాలు చిత్తడిచిత్తడిగా మారుతున్నాయి. రాకపోకలు సాగించేందుకు ప్రజలు పడుతున్న అగచాట్లు అన్నీఇన్నీకావు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి బాబురావు దృష్టికి తీసుకెళ్లగా ఆ ప్రాంతంలో ఇప్పుడిప్పుడే ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, పరిశీలించి విషయాన్ని పాలకవర్గ సమావేశంలో చర్చించి మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, గోరంట్ల

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

'వెలుగు'లో రాజకీయ తొలగింపులు తగదు'

పుట్టపర్తి గ్రామీణం: వెలుగు కార్యాలయం పరిధిలో పనిచేసే వీవోఏల రాజకీయ అక్రమ తొలగింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. శనివారం రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా స్థానిక డీఆర్డీఏ పీడీ కార్యాలయం వద్ద అక్రమ తొలగింపులను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల జోక్యంతో అధికారులు వెలుగు శాఖ పరిధిలో పనిచేసే వీవోఏలను ఎలాంటి తీర్మానాలు లేకుండా, గ్రామ సమాఖ్య సమావేశం నిర్వహించకుండా, మినిట్స్ పుస్తకంలో నమోదు చేయకుండానే సొంత తీర్మానాలతో తొలగించడం సరికాదన్నారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఈపీఎఫ్ మే నుంచి ఇవ్వాల్సిన 5 నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

తోలుబొమ్మల కళాకారుడికి ప్రతిష్ఠాత్మక అవార్డు



ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారుడు **షిందే చిదంబరరావు** యూనివర్సిటీ ఆఫ్ మలావి హెరిటేజ్ అవార్డుకు ఎంపికయ్యారు. తోలుబొమ్మల కళ వారసత్వ సంరక్షణ కృషి చేసినందుకుగాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఆఫ్రికా ఖండంలోని మలావి దేశంలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నట్లు చిదంబరరావు పేర్కొన్నారు. ఆయన వివిధ దేశాల్లో తోలుబొమ్మల ప్రదర్శనలు చేశారు. ఇదివరకు రాష్ట్రపతి అవార్డు, సీనియర్ ఫెలోషిప్, కళానిధి అవార్డులు వరించాయి. ప్రస్తుత అవార్డు తోలుబొమ్మల కళకు దక్కిన గౌరవమని చిదంబరరావు సంతోషం వ్యక్తం చేశారు.

విధుల్లో చేరిన ఆర్డీవో సువర్ణ



పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్డీవోగా సువర్ణ శనివారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఆర్డీవోగా పనిచేస్తున్న భాగ్యరేఖను వెలగపూడి సచివాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశాలువెలువడ్డాయి. ఆర్డీవోగా విధుల్లో చేరిన సువర్ణ తొలిసారి గ్రూప్-1లో శ్రీకాకుళం డీఎం అండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పని చేశారు. రెండో దఫా గ్రూప్-1లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎన్నికయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో శిక్షణ అనంతరం ప్రభుత్వం పుట్టపర్తి ఆర్డీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, ప్రజలు, రైతుల సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించవచ్చని ఆర్డీవో తెలిపారు.

ఏపీఎంగా రవీంద్ర

ఓబుళదేవరచెరువు: డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎంగా రవీంద్ర శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఏపీఎంగా పనిచేస్తున్న రమణప్ప జిల్లా కేంద్రానికి బదిలీ కావడంతో అతని స్థానంలో నల్లచెరువు ఏపీఎంగా పనిచేస్తున్న రవీంద్ర ఓడీసీకి వచ్చారు. వెలుగు సిబ్బంది, సీసీలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఓబుళదేవరచెరువు ఎస్సైగా మల్లికార్జునరెడ్డి

ఓబుళదేవరచెరువు: ఓబుళదేవరచెరువు పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా మల్లికార్జునరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కనగానపల్లి పోలీసుస్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన వంశీకృష్ణ పదోన్నతిపై వెళ్లారు. ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునరెడ్డికి ఏఎస్సై రమణారెడ్డి, జమేదార్ వెంకటరాముడు, వెంకటేష్, పోలీస్ సిబ్బంది స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు.

జిల్లా సర్వే, ల్యాండ్ అసిస్టెంట్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా సర్వే, ల్యాండ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విజయశాంతిబాయి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీ రామకృష్ణ అమరావతి సీసీఎల్ఏకి బదిలీ అయ్యారు. శనివారం కలెక్టరేట్‌లో సర్వే, ల్యాండ్ విభాగంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పలువురు ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

గ్రామైక్య సంఘాల సభ్యుల ఎన్నిక

గాండ్లపెంట: గాండ్లపెంట ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి అధ్యక్షతన సమావేశం నిర్వహించి నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీఎం సూర్యనారాయణ తెలిపారు. నూతన మండల అధ్యక్షురాలిగా సూర్యకాంతి, ఉపాధ్యక్షురాలిగా సుజాత, కోశాధికారి సరిత, కార్యదర్శిగా మానిక, సంయుక్త కార్యదర్శిగా అభిలాషాలను ఎన్నుకున్నారు. అనంతరం వచ్చే ఏడాదికి సంబంధించిన ప్రణాళిక, బడ్జెట్ తయారు చేశారు. కార్యక్రమంలో శ్రీనిధి ఏజీఎం వేణు, సీసీలు ప్రసాద్, షాకీర్, నిర్మలమ్మ, రామానారెడ్డి, ఎంఎస్ఏ జానకి, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురం కాడలిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు పేర్కొన్నారు. మండలంలోని ముక్తాపురం గ్రామానికి చెందిన రవి పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో మామిళ్లపల్లికి వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో ముక్తాపురం కాడలి వద్ద వాహనం అదుపు తప్పి కిందకు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అనంతపురంలోని సర్వజన వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

యానిమేటర్, సంఘం లీడర్లపై కేసు

కదిరి పట్టణం: పొదుపు మహిళల సమావేశ తీర్మానం మేరకు కదిరి మండలం అంజనేయ మహిళా సంఘం రికార్డులను వెలుగు కార్యాలయంలో అందజేయాలన్న సూచనను పట్టించుకోని యానిమేటర్, సంఘం లీడర్లపై కదిరి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. వెలుగు ఏపీఎం శారద ఫిర్యాదు మేరకు వివరాలు.. కదిరి మండలం ముత్యాలచెరువు అంజనేయ మహిళా సంఘం తీర్మానాన్ని యానిమేటర్ సుబ్బారెడ్డి, సంఘం లీడర్లుగా ఉన్న షరీఫా, అరుంధతి లెక్క చేయకపోవడంతో వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఏపీఎం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.

నిర్వహణ శూన్యం.. పార్కులు అధ్వానం

వైకాపా హయాంలో నిధులు మంజూరు చేయకపోవడంతో ఆహ్లాదం కరవు



ధర్మవరంలో పిల్లల వ్యాయామ పరికరాలపై ఆరేసిన దుస్తులు

ధర్మవరం పట్టణం, కదిరి పట్టణం, పుట్టపర్తి, న్యూస్‌టుడే: పట్టణాల్లో ఆహ్లాదం పంచే పార్కుల నిర్వహణను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అవి అధ్వానంగా మారాయి. ఉద్యానాల్లో పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు, యువకులు, పెద్దలకు వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. కానీ, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అవి మూలకుచేరాయి. అధికారులు వీటిని పట్టించుకోకపోవడంతో పార్కుల రూపురేఖలు మారిపోయాయి. కొన్నిచోట్ల పిచ్చిమొక్కలు పెరిగి అడవులను తలపిస్తున్నాయి.



కదిరి పిల్లవంక కాలనీలోని పార్కులో పెరిగిన కంపచెట్లు

ఐదేళ్లలో రూపాయి విదల్చలేదు..

2014 తెదేపా ప్రభుత్వం హయాంలో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి గ్రామీణ, పట్టణాభివృద్ధి శాఖ ద్వారా రాష్ట్రంలోని పలు పట్టణాలకు అమృత్ పథకాన్ని మంజూరు చేయించింది. ఈ పథకంలో భాగంగా పలు మున్సిపాలిటీలకు తాగునీటి ట్యాంకుల నిర్మాణంతో పాటు, పార్కుల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించింది. పనులు దక్కించుకున్న గుత్తేదారులు 70 శాతం పనులు పూర్తి చేశారు. మిగతా 30 శాతం పనుల్లో ఉద్యానాలు అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈ పనులు చేపట్టేలోపే ప్రభుత్వం మారపోగా పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. చేసిన వాటికి బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారు. దీంతో పార్కుల అభివృద్ధిని ప్రభుత్వం విస్మరించింది. ఐదేళ్ల కాలంలో ఉద్యానాల అభివృద్ధికి ఒక్క రూపాయీ ఖర్చు చేయలేదనే ఆరోపణలున్నాయి.

మందుబాబులకు అడ్డాగా..

పార్కుల నిర్వహణను మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో అవి మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. ఉద్యోగులు, మహిళలు సాయంత్రం పూట పార్కుల్లో నడక (వాకింగ్) చేసేందుకు వస్తుంటారు. కొందరు మందుబాబులు మద్యం మత్తులో సీసాలను పార్కుల సమీపంలోనే పగులగొడుతున్నారు. మరికొందరైతే బల్లలపై కూర్చొని దర్జాగా మద్యం తాగుతూ ఊగుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే భౌతికదాడులకు దిగుతున్నారని పాదచారులు వాపోతున్నారు. దీంతో పార్కులకు రావాలంటే భయపడుతున్నారు.

అభివృద్ధి చేస్తాం

ఉన్నతాధికారులతో మాట్లాడి పార్కులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తాం. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిరోధిస్తాం. మరమ్మతులు గురైన వ్యాయామ పరికరాలను వాడుకలోకి తెస్తాం. **- కిరణ్‌కుమార్, ప్రహ్లాద కదిరి, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్లు**

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య: బండ్లపల్లి బీసీకాలనీలో కొన్నిరోజులుగా వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రివేళ ఇబ్బందిగా ఉంది. **- శ్రీనివాసులు**

సమాధానం: రోడ్డుపై ఉన్న వీధిదీపాలు తలుపుల పంచాయతీకి వస్తాయి. కాలనీలో ఉన్నవి మాత్రమే బండ్లపల్లి పంచాయతీకి వస్తాయి. పరిశీలించి వీధిదీపాలు ఏర్పాటు చేస్తాం. **- హరి, బండ్లపల్లి కార్యదర్శి**

సమస్య: తలుపుల పూలబజార్ వీధిలో ఇళ్ల ముందే మురుగు పేరుకుపోయి ఇబ్బందిగా ఉంది. **- బాషా**

సమాధానం: రెండ్రోజులు వర్షాలకు నీరు చేరి ఉండొచ్చు. వాటిని తొలగించి దోమలు రాకుండా మందులు పిచికారీ చేస్తాం. **- అబ్దుల్‌మునాఫ్, తలుపుల కార్యదర్శి**

సమస్య: కొత్తపేట వద్దనున్న తలుపుల గాండ్లోడ్డంతా నీరు నిలిచి నడవడానికి వీలేకుండా మారుతుంది. దోమలు పెరుగుతున్నాయి. **- రామకృష్ణ**

సమాధానం: వర్షం వచ్చిన ప్రతిసారీ నీటిని తోడేస్తున్నాం. ఆ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి. ఇందుకు ఆలస్యం అవుతుంది. **- అబ్దుల్‌మునాఫ్, కార్యదర్శి, తలుపుల**

– న్యూస్‌టుడే, తలుపుల

విద్యుత్తు స్తంభానికి తీగల తొలగింపు



గాండ్లపెంట, న్యూస్‌టుడే: విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న పిచ్చిమొక్కల తీగలను సిబ్బంది మహబూబ్‌బాషా తొలగించారు. శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'స్తంభానికి అల్లుకున్న నిర్లక్ష్యం' కథనానికి విద్యుత్తు అధికారులు స్పందించారు. విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న తీగలను తొలగించి విద్యుత్తు వైర్లు సరిచేశారు. ప్రమాదాలు, విద్యుత్తు అంతరాయం జరగకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రకృతి కోపం...రైతుకు శాపం



కనగానపల్లిలో నలుపు దశకు చేరుకున్న వేరుసెనగ పంట

కనగానపల్లి, న్యూస్‌టుడే ఎడతెరపి లేకుండా నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పొలం నుంచి తొలగించిన వేరుసెనగ పంట తడిచి నలుపు దశకు చేరుకోవడంతో గ్రాసంతో పాటు వేరుసెనగ కాయలు నలుపు దశకు చేరుకున్నాయి. ఫలితంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మండలంలోని మామిళ్లపల్లి, ముక్తాపురం, చంద్రచార్ల, కనగానపల్లి, శివపురం, కొండపల్లి తదితర గ్రామాల్లో నాలుగు నెలల క్రితం బోరుబావుల కింద వేరుసెనగ సాగు చేశారు. పొలం నుంచి పంటను తొలగించినప్పటి నుంచి తెరిపివ్వకుండా వర్షాలు కురుస్తున్నందున వేరుసెనగ పంట కుళ్లు దశకు చేరుకొని కాయలు రాలిపోవడం, మొసులు రావడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పంటను ఆరబెట్టడం రాత్రి సమయంలో మరలా వర్షం కురవడంతో రైతుకు అదనపు భారం పడుతోంది. మండల వ్యాప్తంగా వంద ఎకరాలకు పైగానే వేరుసెనగ పంట తడిచిపోయినట్లు అన్నదాతలు చెబుతున్నారు.

వైద్యుల గైర్హాజరుపై డీసీహెచ్‌ఎస్ ఆగ్రహం



శుద్ధజల యంత్రాన్ని పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్ర నాయక్

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం పేదలు, గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణ కోసం పాటుపడుతుంటే వైద్యులు సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించడం తగదని డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్ర నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీకేపల్లి సీహెచ్‌సీని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. ఎంత మంది వైద్యులు ఉన్నారు? ప్రస్తుతం విధుల్లో ఎంతమంది ఉన్నారంటూ? సిబ్బందిని ప్రశ్నించారు. విధుల్లో ఉండాల్సిన పలువురు వైద్యులు లేకపోవడంతో ఎందుకు హాజరుకాలేదని ప్రశ్నించారు. పేదలకు వైద్యం అందించడంలో ఉన్న చిత్తశుద్ధి ఇదేనా? అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం నమోదవుతున్న ఓపీ సంఖ్యను గమనిస్తేనే వైద్యులు, సిబ్బంది పనితీరు అర్థమవుతోందంటూ అసహనం వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాకుండా, వచ్చిన రోగులను సక్రమంగా పలకరించకపోయినా, వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా శాఖాపర చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరిసరాల శుభ్రతతో అంటువ్యాధులకు కళ్లెం



న్యాయవాదులు, సిబ్బందితో కలిసి చెత్త తొలగిస్తున్న న్యాయమూర్తి జయలక్ష్మి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చని కదిరి సీనియర్ సివిల్‌జడ్జి జయలక్ష్మి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం కదిరి న్యాయస్థానాల ఆవరణలో న్యాయవాదులు, సిబ్బందితో కలిసి చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. అపరిశుభ్రత వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, లోకేశ్వరరెడ్డి, కోర్టు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి గొర్రెల కాపరి మృతి

రామగిరి, న్యూస్‌టుడే: చెట్టు మీద నుంచి పడి గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై సుధాకర్ యాదవ్ తెలిపిన వివరాల మేరకు... ఏడుగుర్రాలపల్లికి చెందిన హనుమంతు (54) మేపు నిమిత్తం గొర్రెలను గ్రామానికి సమీప దూరంలో ఉన్న కొండప్రాంతంలోకి తీసుకెళ్లాడు. వేపచెట్టు ఎక్కి గొర్రెలకు మేతగా కొమ్మలు తుంచుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందకు పడి గాయపడ్డాడు. వైద్యం నిమిత్తం అనంతపురానికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య అంజినమ్మ, ఒక కుమారుడు ఉన్నారు.

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం



కమతం కాటమయ్య

ధర్మవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా శనివారం విజయవాడలోని ఆ సంస్థ కార్యాలయంలో ధర్మవరానికి చెందిన కమతం కాటమయ్య ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా సుబ్బారెడ్డి, డైరెక్టర్‌గా కమతం కాటమయ్య ప్రమాణ స్వీకారం చేశారు. తెదేపా ఆవిర్భావం నుంచి కాటమయ్య పార్టీలో ఉన్నారు. ఛైర్మన్, ఉద్యోగుల సహకారంతో సంస్థ, రైతుల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని కాటమయ్య తెలిపారు.

ఆరోగ్య పరిరక్షణతో ప్రశాంత జీవనం

కదిరి, న్యూస్‌టుడే: మానవ జీవితంలో ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రశాంత జీవనం సాధ్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. కదిరి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కందికుంట నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మనిషికి ఆరోగ్యమే భాగ్యమని పేర్కొన్నారు. బెంగళూరు వైదేహి ఆసుపత్రి వైద్యులు రోగులను పరీక్షించారు. 795 మంది వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చారు. ఇందులో నలుగురికి గుండె, నలుగురు కిడ్నీ, మరో ఐదుగురు మోకాళ్ల సమస్యతో బాధ పడుతున్నట్లు గుర్తించారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

గాండ్లపెంట: మండల సర్వసభ్య సమావేశానికి మండల రెవెన్యూ, ఆర్టీసీ, సెరికల్చర్, ఇరిగేషన్, అటవీశాఖ, ఉద్యాన, మత్స్యశాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ఎంపీపీ గంగోజమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం తూతూమంత్రంగా ముగించారు. వివిధ శాఖ అధికారులు తమ శాఖ పనితీరును వివరించారు. అంగన్‌వాడీ పర్యవేక్షురాలు పద్మావతమ్మ మాట్లాడుతుండగా సర్పంచులు సుధాకర్, శివప్పనాయుడు, ఎంపీటీసీ జయరామ కృష్ణారెడ్డి లేచి అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే సామగ్రి వివరాలు పొందుపర్చాలని, కార్యకర్తలు సమయపాలన పాటించేలా పర్యవేక్షించాలని వాదించారు. అనంతరం వివిధ సమస్యలపై చర్చించారు.



ధర్మవరం: పద్మావతిగా శాంతకళా చౌడేశ్వరీదేవి



ధర్మవరం: రాజరాజేశ్వరి దేవిగా దుర్గమ్మ



న్యామద్దల: ప్రత్యేక అలంకరణలో మహేశ్వరి



ముదిగుబ్బ: వెంకటేశ్వర స్వామిగా వాసవీమాత



తాడిమర్రి: గాయత్రిదేవి అలంకరణలో..



కదిరి: నృసింహావతారంలో ఖాద్రీశుడు



నల్లచెరువులో కన్యకాపరమేశ్వరి



కదిరి గ్రామీణం: మీనాక్షిగా మల్లాలమ్మ

అమ్మవారి రూపం.. ఆధ్యాత్మిక దీపం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల వ్యాప్తంగా దుర్గామాత లలితాదేవి, గాయత్రి దేవి, సరస్వతీ దేవి, అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు. నవదుర్గా రూపాలతో బాధల్లో ఉన్న భక్తులకు నవనీత హృదయంతో ఆదుకునే జగన్మాతకు వాడవాడలా విశేష పూజలు, ఆరాధనలు ఘనంగా జరిగాయి. అర్చకులు సహస్ర కుంకుమార్చనతో అమ్మవారిని ఆరాధించారు. – న్యూస్‌టుడే బృందం



పుట్టపర్తి గ్రామీణం: హోమక్రతువులో పండితులు, బాబా భక్తులు



కొత్తచెరువు: అన్నపూర్ణగా వాసవీమాత

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, న్యూస్‌టుడే: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం బాలికల పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కందికుంట నారాయణమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఇస్తున్న ఉచిత శిక్షణలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. సమాజ హితం కోరి శిక్షణలో తమవంతు భాగస్వాములైన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు నగేష్, ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబుళరెడ్డి, తెదేపా నాయకులు శంకర్, నాగప్ప, శిక్షణలో సేవలు అందించిన ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వెంకటరమేష్, పవన్‌కుమార్, సునీల్‌కుమార్, మనోహర్, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేలు విరాళం

ఓబుళదేవరచెరువు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి మండలంలోని ఇనగలూరుకు చెందిన తెదేపా యువ నాయకుడు సిద్ధ చలపతినాయుడు రూ. 50 వేల చెక్కును మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి అందజేశారు. చలపతినాయుడు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు తనవంతు సాయం అందించినట్లు తెలిపారు. సాకివేలు శ్రీనివాసులు పాల్గొన్నారు.



పట్టు తప్పితే.. ప్రాణాలు గాలిలోకే

పనులకు త్వరగా వెళ్లాలనే ఆలోచనతో కూలీలు వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. శనివారం పట్టణంలో కదిరిగేట్ వద్ద కొందరు కూలీలు వేరుసెనగ నూర్పిడి వాహన యంత్రంపై ప్రమాదకరంగా కూర్చొని వెళుతున్న దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. వాహనం వేగంగా వెళ్తున్న సమయంలో ఏదైనా అడ్డు వచ్చినా, గుంతల్లో చోదకుడు బ్రేక్ వేసినా కూలీలు ఆ వాహన చక్రాల కింద నలిగిపోవాల్సిందే. ఇటీవల పలుచోట్ల ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నా కూలీలు, వాహన యజమానులకు కనువిప్పుకావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. – న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

మాంసం ఉత్పత్తి కేంద్రాలతో ఉపాధి అవకాశాలు



పొట్టేళ్ల పెంపకంపై ఆరాతీస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి గ్రామీణం: గొర్రెలు, పొట్టేళ్ల పెంపకంతోపాటు మాంసపు ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు, ఎగుమతులు చేపడితే యువత మెండుగా ఉపాధి అవకాశాలు పొందుతారని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని పైపల్లిలో మంజునాథ, అతని తమ్ముడు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో రూ.కోటితో చేపట్టిన రెండు గొర్రెల పెంపకం యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. పెంపకంలో సాధకబాధకాలు, పొందుతున్న ప్రయోజనాలు ఇతరత్రాపై నిర్వాహకులతో ఆరాతీశారు. జిల్లా వ్యాప్తంగా నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో 31 లక్షలకుపైగా గొర్రెల పెంపకం చేపట్టారన్నారు. మరిన్ని యూనిట్లు మంజూరు చేసి ఇతర ప్రాంతాలకు మాంసం ఎగుమతికి అవకాశాలను కల్పిస్తే పెంపకందారులకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. కలెక్టర్ వెంట పశుసంవర్ధకశాఖ జేడీ శుభదాస్, వైద్యులు చైతన్య, నాగేంద్ర పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగులను ఆదుకోవాలి



నినాదాలు చేస్తున్న తపాలా ఉద్యోగులు

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: తపాలా ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లను తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 3వ తేదీ నుంచి తపాలా ఉద్యోగులు చేపట్టిన సహాయ నిరాకరణకు ఉద్యమం శనివారం ముగిసింది. గ్రామ్‌సడక్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఆయా కార్యాలయాల పరిధిలో మూడు రోజులుగా సహాయ నిరాకరణ చేపట్టారు. అందులో భాగంగా శనివారం పుట్టపర్తి తపాలా కార్యాలయం ముందు ఉద్యోగులు విధులు బహిష్కరించి కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు అల్లాబకష్, రామాంజనేయులు నాయక్ మాట్లాడుతూ పని ఒత్తిడి తగ్గించాలని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆరోగ్యపరంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

పుట్టపర్తి: క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, సంబంధిత అధికారులు, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలో టీబీ నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాల అమలు తీరుపై జేసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1750 టీబీ కేసులు ఉండగా, అత్యధికంగా తనకల్లు మండలంలో నమోదవుతున్నాయని, కారణాలపై అధ్యయనం చేయాలని సూచించారు. డీఆర్‌ఓ కొండయ్య, జిల్లా వైద్యాధికారిణి మంజువాణి, వైద్యులు తిప్పయ్య, రఘు, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చికిత్సకు ఆర్థిక సాయం

ధర్మవరం: మండలంలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన నాగమ్మ అనే మహిళ మూత్రపిండాల జబ్బుతో బాధపడుతుండటంతో ఆమెకు వైద్యం కోసం రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని జడ్పీ మాజీ ఛైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి అందజేశారు. శనివారం నాగమ్మ ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని నగదు అందజేశారు.